క్లుప్తంగా

రంగడ్ని దర్శించుకున్న ఏఎస్పీ దంపతులు



నెల్లూరు(బృందావనం): నగరంలోని శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామిని నెల్లూరు ఏఎస్పీ సౌజన్య, తిరుపతి టాస్క్ ఫోర్స్ ఏఎస్పీ శ్రీనివాసులు దంపతులు బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా కిట్ల పంపిణీ



నెల్లూరు రూరల్: ఆడుదాం.. ఆంధ్రా క్రీడాకారులకు కిట్లను నగరంలోని 20వ డివిజన్లో బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇన్చార్జీలు రావు శ్రీనివాసరావు, తాళ్లూరి సురేష్ మాట్లాడారు. క్రీడలను పోత్సహించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్: మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి బుధవారం మృతి చెందారు. రూరల్ ఎస్సై లక్ష్మణ్ వివరాల మేరకు.. ధోబీ పనులు చేసుకొని జీవించే వడ్డిపాళేనికి చెందిన గుత్తి పెంచలనరసయ్య (33)కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. విభేదాల కారణంగా భార్య పుట్టింటికెళ్లారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై గడ్డి మందును ఈ నెల 8న సేవించారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను నారాయణ ఆస్పత్రిలో చేర్పించగా, చికిత్స పొందుతూ మరణించారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని నగరంలోని జీజీహెచ్కు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పట్టణ ప్రగతి యూనిట్ ప్రారంభం



నెల్లూరు(బారకాసు): మూలాపేటలోని బ్రాహ్మణవీధిలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రగతి యూనిట్ (కంప్యూటర్ ఎంబ్రాయిడరీ కేంద్రం)ను మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పట్టణ పొదుపు సంఘ సభ్యులకు జీవనోపాధి కల్పించడంలో మెప్మా ఎప్పుడూ ముందుంటుందని చెప్పారు. రాష్ట్ర మిషన్ మేనేజర్ ఆదినారాయణ, రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో విలువలతో కూడిన విద్య

కోవూరు: ప్రభుత్వ కళాశాలల్లో విలువలతో కూడిన విద్యనందిస్తున్నామని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి కే మధుబాబు పేర్కొన్నారు. కోవూరులోని టీఎన్సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ సికింధర్ అధ్యక్షతన 52వ వార్షిక వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీవీఈఓ కే మధుబాబు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. డీఏబీ చైర్మన్ నిరంజన్బాబురెడ్డి మాట్లాడుతూ కళాశాలలో టాపర్గా నిలిచిన విద్యార్థులకు రూ.25 వేలు నగదు బహుమతి అందజేస్తామని ప్రకటించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

‘ఆడుదాం.. ఆంధ్రా’ పోటీల పరిశీలన



సూచనలు చేస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): ఆడుదాం.. ఆంధ్రా పోటీల్లో భాగంగా నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను కమిషనర్ వికాస్ మర్మత్ బుధవారం పరిశీలించారు. అదనపు కమిషనర్ శర్మద, చీఫ్ కోచ్ యతిరాజ్, టీపీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

- వావిలేటిపాడులోని హిందూ శ్మశాన వాటిక రికార్డ్ అప్డేషన్లో భాగంగా కమిషనర్ పరిశీలించారు. సిటీ ప్లానర్ దేవీకుమారి తదితరులు పాల్గొన్నారు.
- స్థానిక 12 / 3 చింతారెడ్డిపాళెం – 2, 27 / 1, 2, 3 పోలీస్కాలనీ, ఓల్డ్ గిరిజనకాలనీ, లక్ష్మీసాయినగర్ వార్డు సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు.
- ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో గురువారం నిర్వహించనున్న అంబేడ్కర్ జీవిత చరిత్ర ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. వీక్షకుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను ప్రణాళికబద్ధంగా చేపట్టాలని సూచించారు. సిటీ ప్లానర్ దేవీకుమారి, టీపీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన రాగతరంగిణి



కేక్ను కట్ చేస్తున్న అతిథులు

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో గాయకుడు ఏసుదాస్ జన్మదిన వేడుకలను విజయ్ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి కేక్ను కట్ చేశారు. అనంతరం రాగతరంగిణి కార్యక్రమంలో భాగంగా పాటల పోటీలు, సంగీత విభావరిని నిర్వహించారు. విజయ్ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు విజయకుమార్ శిష్యబృంద ఆధ్వర్యంలో ఔత్సాహిక కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్పొరేటర్ మొయిళ్ల గౌరి, మొయిళ్ల సురేష్రెడ్డి, ఎస్వీబీ ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాల విశ్రాంత ప్రిన్సిపల్ మద్దెల సాయిబాబా, సీఐ అంకమరావు, బాబు, 25 కళాసంఘాల కన్వీనర్లు అమీర్జాన్, దోర్నాల హరిబాబు, హరనాథ్రెడ్డి, భాస్కర్, డ్యాన్స్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జహీర్ తదితరులు పాల్గొన్నారు.

హ్యాండీక్రాఫ్ట్స్ ఆర్టిజన్ కార్డుల అందజేత



కార్డును పంపిణీ చేస్తున్న సత్యమూర్తి, తదితరులు

నెల్లూరు (వేదాయపాళెం): చేతివృత్తిదారులకు కేంద్ర ప్రభుత్వ హ్యాండీక్రాఫ్ట్స్ ఆర్టిజన్ కార్డులను కామాటివీధిలోని కృష్ణ మందిరంలో బుధవారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన హ్యాండీక్రాఫ్ట్స్ ఆర్టిజన్ డిపార్ట్మెంట్, తిరుపతి బ్రాంచ్ అడిషనల్ డైరెక్టర్ సత్యమూర్తి మాట్లాడారు. కార్డులు పొందిన కార్మికులకు ముద్ర రుణాల్లో 20 శాతం సబ్సిడీ ఉంటుందని, అదే విధంగా వ్యక్తిగత ఇన్సూరెన్స్ సౌకర్యం సైతం లభిస్తుందని చెప్పారు. అనంతరం స్కిల్ డెవలప్మెంట్ ట్రెయినింగ్ సెంటర్ అధికారి విజయ్ వినీల్ మాట్లాడారు. పీఎం విశ్వకర్మ యోజనకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శిక్షణను త్వరలో నిర్వహించనున్నామని చెప్పారు. శిక్షణ కాలంలో రూ.500 స్టయిఫండ్, సర్టిఫికెట్, రూ.15 వేల విలువజేసే పరికరాలను అందజేయనున్నామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్టిజన్ కన్వీనర్ బంగారుబాబు, కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు భాజన వెంకటశేషయ్య ఆచారి, గౌరవాధ్యక్షుడు పోలిశెట్టి సదాశివ ఆచారి, కోశాధికారి ఏలూరు బాబు, ప్రసాద్, చంద్ర, రఘురామయ్య, మహిళాధ్యక్షురాలు మహేశ్వరి, జయలక్ష్మి, జ్యోతి, సువర్ణ, యువజన సంఘ అధ్యక్షుడు మదన మోహన్ తదితరులు పాల్గొన్నారు.

13న ‘మన సంక్రాంతి.. మన పెద్దల పండగ’



టోకెన్లు పంపిణీ చేస్తున్న ద్వారకానాథ్

నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని ఎస్వీఎస్ కల్యాణ మండపంలో మన సంక్రాంతి.. మన పెద్దల పండగ కార్యక్రమాన్ని ఈ నెల 13న ఎస్వీఎస్సార్ నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన టోకెన్లను స్టోన్హౌస్పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. 600 మంది నిరుపేదలకు నిత్యావసర సామగ్రిని అందజేయనున్నామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కోట సూర్యనారాయణ, అర్బన్ ఆర్యవైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు పేర్ల సీతారామారావు, కార్యదర్శి బైసాని జ్యోతిప్రసాద్, దేవస్థాన పాలకమండలి చైర్మన్ శ్రీరామ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

‘నైతిక పదాలు’ పుస్తకావిష్కరణ



నెల్లూరు(బృందావనం): బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన కవి తిప్పావఝుల నరసింహమూర్తి రచించిన నైతిక పదాలు నానీల పుస్తకాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో పెన్నా రచయితల సంఘ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనానికి 35 మంది కవులు హాజరయ్యారు. రచయిత నరసింహమూర్తి, అరుణ దంపతులు, కవులను సత్కరించారు. కవి పెరుగు రామకృష్ణ, విజిలెన్స్ డీఎస్పీ కొల్లూరు శ్రీనివాసులు, పెరసం అధ్యక్షుడు శ్రీధర్బాబు, కవయిత్రి పెళ్లకూరు జయప్రద, నెల్లూరు బాలభవన్ డైరెక్టర్ గోవిందరాజు సుభద్రాదేవి, మోపూరు పెంచలనరసింహం, తోట సులోచన, సుబ్రహ్మణ్యం, మాటేటి రత్నప్రసాద్, ములుగు లక్ష్మీమైథిలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



మాట్లాడుతున్న మహేంద్రరెడ్డి

నెల్లూరు(బారకాసు): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు ఎంతో దోహదపడతాయని జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. కస్తూర్బా కళాక్షేత్రంలోని నెహ్రూ యువ కేంద్ర కార్యాలయంలో విద్యార్థులకు జిల్లా స్థాయిలో వక్తృత్వ పోటీలను యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువ కేంద్ర జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. అభివృద్ధి చెందిన భారతదేశం – 2047 అనే అంశంపై నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో అగస్త్య నిలిచింది. రాష్ట్ర స్థాయి పోటీల్లో అగస్త్య ప్రాతినిధ్యం వహించనుంది.

హక్కుల సాధనకు పోరాటం



ఏకలవ్య చిత్రపటానికి నివాళులు

నెల్లూరు (వేదాయపాళెం): ఎరుకుల హక్కుల సాధన కోసం పోరాటాలు సాగిస్తున్నామని ఏపీ ఎరుకుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు నల్లగొండ్ల శివ పేర్కొన్నారు. మినీబైపాస్లోని ఏపీ ఎరుకుల సేవా సమితి కార్యాలయంలో సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. తొలుత ఏకలవ్య చిత్రపటానికి నివాళులర్పించారు. కట్టా రమణయ్య, వెంకటేష్, గోపీ, హరీష్, మల్లికార్జున, ధనుంజయ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడి అరుణకు అభినందన



నెల్లూరు (వేదాయపాళెం): సహకార సంఘ ఎన్నికల్లో విజయం సాధించిన గొర్రెల ఉత్పత్తిదారుల సహకార సంఘ చైర్పర్సన్ గుమ్మడి అరుణను నగరంలోని ఆమె నివాసంలో పలువురు బుధవారం అభినందించారు. బీసీ నేత మన్నవరపు శ్రీకాంత్యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వస్త్రాల పంపిణీ



నెల్లూరు(బృందావనం): కొండాయపాళెం రోడ్డులోని జనహిత – వాత్సల్య నిరాధార ఆశ్రమంలో 80 మంది విద్యార్థులకు వస్త్రాలను మానవసేవే మాధవసేవ టీమ్ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం అందజేశారు. ఏడీఎంహెచ్ఓ ఖాదర్వలీ, ఏపీజీఈఎఫ్ జిల్లా చైర్మన్ చేజర్ల సుధాకర్రావు, నేతలు ఆంజనేయవర్మ, కల్పం శ్రీనివాసులు, పరిమళ, ఇందిర, ఖాదర్మస్తాన్, కామేశ్వరి, సునీత, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేక అర్చన



నెల్లూరు(బృందావనం): పొగతోటలోని ఆదిశంకర ధ్యాన మందిరంలో రుద్రాభిషేక అర్చనను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. అనంతపురంలోని జగద్గురు ఆదిశంకర దత్తాత్రేయ మహాసంస్థాన పీఠాధిపతి విద్యానృసింహభారతి హాజరై అనుగ్రహభాషణ చేశారు. శంకరాచార్యులు అద్వైత సిద్ధాంతాన్ని ప్రకటించి ధర్మప్రచారాన్ని చేశారని చెప్పారు. చక్రాల వారి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆనంద్కుమార్, సమయానందనాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: నగరంలోని ఆర్టీసీ ఒకటో డిపోలో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. యర్రబల్లికి రోజూ రెండు ట్రిప్పుల బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఆ గ్రామానికి చెందిన కుమార్ కోరారు. నెల్లూరు నుంచి రాపూరుకు ప్రస్తుతం రాత్రి పది గంటలకు నడుపుతున్న సూపర్ లగ్జరీ బస్సు స్థానంలో ఎక్స్ప్రెస్ సౌకర్యాన్ని కల్పించాలని మరొకరు విజ్ఞప్తి చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు చేపడతామని డిపో మేనేజర్ మురళీకృష్ణ హామీ ఇచ్చారు.

వేణుగోపాలుడి సేవలో..

నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామిని నెల్లూరు ఫస్ట్క్లాస్ అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి కపర్థి దంపతులు బుధవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వీరిని ఆలయ మర్యాదలతో ఈఓ దాసరి చంద్రశేఖర్రావు ఆహ్వానించారు. దేవస్థాన ప్రాంగణంలోని గోశాలను సందర్శించి పూజలు చేశారు. దేవస్థాన సిబ్బంది రాజు తదితరులు పాల్గొన్నారు.

‘డీకేడబ్ల్యూ’లో వచ్చే నెల్లో గ్రాడ్యుయేషన్ డే

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో 2019 – 22 మధ్య ఉత్తీర్ణులైన విద్యార్థినులకు గ్రాడ్యుయేషన్ డేను వచ్చే నెల మొదటి వారంలో నిర్వహించనున్నామని ప్రిన్సిపల్ గిరి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ల కోసం విద్యార్థినులు ఈ నెల 19లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు dkwgdcnellore.ac.inను సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వైఎమ్సీఏ సబ్స్టేషన్ పరిధిలో గల దర్గామిట్ట ఫీడర్లో మరమ్మతులకు గురైన లైన్లను మార్చనున్న తరుణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా గురువారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరవిందనగర్, శోధన్నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.